

200 మందికి ఉచిత వైద్యపరీక్షలు

ప్రజాశక్తి - కాట్రేనికోన

కోనసీమ కేర్ ఆస్పత్రి సౌజన్యంతో కాట్రేనికోన శివారు అడవిపేటలో ఆదివారం ఏర్పాటుచేసిన వైద్యశిబిరంలో సుమారు 200 మంది వైద్యపరీక్షలు నిర్వహించారు. ఉచిత మెగా వైద్య శిబిరాన్ని కాట్రేనికోన సర్పంచ్, సర్పంచుల సమాఖ్య అధ్యక్షులు గంటి వెంకట సుధాకర్ రావు, మండల వైసిపి అధ్యక్షులు నల్లా నరసింహమూర్తి సంయుక్తంగా ప్రారంభించారు. డాక్టర్ కారెం రవితేజ, డాక్టర్ డి.శ్రావణి లు కోనసీమ కేర్ ఆస్పత్రి వైద్య బందం పర్యవేక్షణలో వైద్య శిబిరం నిర్వహించారు. ఉచితంగా సేవలు అందించిన సందర్భంగా పెద్దలు ఇద్దరు వైద్యులను సన్మానించారు. కార్యక్రమంలో అడవిపేట వైసిపి నాయకులు నీలం బాలయోగి, పెయ్యల రవీంద్ర కుమార్, పెయ్యల సతీష్, బడుగు మధు, బడుగు మైనర్ బాబు, కరుకోటి రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ పరీక్షలకు సర్వం సిద్ధం

- జిల్లాలో రెండు చోట్ల సిసి కెమెరాల ఏర్పాటు
- డిఇఒ కమలకుమారి

ప్రజాశక్తి-యంత్రాంగం

టెన్త్ పబ్లిక్ పరీక్షలు నేటి నుంచి ప్రారంభంకానున్నాయి. పరీక్షలకు సంబంధించి అధికారులు సర్వం సిద్ధం చేశారు. వివరాలు ఇవి..

అమలాపురం ఈ నెల 3 నుంచి 18వ తేదీ వరకు పదోతరగతి పరీక్షలు నిర్వహించనున్నట్లు డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా విద్యా శాఖ అధికారి ఎం.కమలకుమారి తెలిపారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. విద్యార్థులు ఉదయం 8.45 గంటల నుంచి 9.30 గంటల లోపు కేంద్రం వద్దకు చేరుకోవాలని సూచించారు. ప్రత్యేక కారణాలుంటే తప్ప ఉదయం 9.30 గంటల తర్వాత నిమిషం ఆలస్యమైనా పరీక్ష హాల్లోకి అనుమతించబోమన్నారు. 3వ తేదీ నుంచి ఒంటిపూట బడులు నిర్వహిస్తున్నట్లు వివరించారు. పదో తరగతి విద్యార్థులు తమ హాల్ టికెట్ చూపించి ఆర్‌టిసి బస్సుల్లో ఉచితంగా పరీక్షకేంద్రానికి చేరుకోవచ్చని తెలిపారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో 374 ప్రభుత్వ, ప్రయివేటు స్కూళ్లకు చెందిన 20,967 మంది విద్యార్థులు టెన్త్ పరీక్షలు రాయనున్నారని ఆమె తెలిపారు. ఇందులో 10,868 మంది బాలురు, 10,099 మంది బాలికలు ఉన్నారు. ఇందుకోసం జిల్లా వ్యాప్తంగా 111 కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ఆమె తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద విద్యార్థులకు తాగునీటి సదుపాయం ఏర్పాటు చేశామన్నారు. అలాగే అంతరాయం లేకుండా విద్యుత్తు సరఫరాకు అన్ని చర్యలు తీసుకున్నట్లు డిఇఒ తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద సెల్ ఫోన్లు నిషేధించామన్నారు. ఇన్విజిలేటర్లు కూడా సెల్ ఫోన్లు అనుమతి లేదన్నారు. 144 సెక్షన్ అమలులో ఉంటుందని తెలిపారు. ఏ విధమైన ఇబ్బందులు తలెత్తకుండా పరీక్షలను పకడ్బందీగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేశామని తెలిపారు. జిల్లాలో రెండు చోట్ల సిసి కెమెరా పర్యవేక్షణలో పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. మామిడికుదురు మండలం మొగలికుదురు రాయవరం మండలం పసలపూడి లో ఇప్పటికే సిసి కెమెరాలు ఏర్పాటు చేశామని తెలిపారు. **ఐ.పోలవరం** మండలంలో పదవ తరగతి పరీక్షలు 3వ తేదీ నుంచి 18వ తేదీ వరకు జరుగుతాయని ఎంఇఒ కె.వెంకటేశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందు కోసం మండలంలోని పదకొండు ప్రభుత్వ, నాల్గు ప్రైవేట్ పాఠశాలలకు సంబంధించి 706మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతారన్నారు. వీరిలో తెలుగు మీడియానికి చెందిన 144 మంది బాలురు, 185 మంది బాలికలు, ఇంగ్లిషు మీడియం నుంచి 218మంది, బాలురు, 159 మంది బాలికలు పరీక్షలు రాసేందుకు నాల్గు సెంటర్లు ఏర్పాటు చేశామన్నారు. పరీక్షలు రాసేందుకు వచ్చే విద్యార్థులు విధిగా హాల్ టికెట్, బ్లూ లేదా బ్లాక్ పెన్ను, పరీక్ష రాయడానికి ప్యాడ్ తెచ్చు కోవాలని తెలిపారు. **కపిలేశ్వరపురం** ఈనెల 3 తేదీ నుంచి జరిగే టెన్త్ పరీక్షా కేంద్రాల వద్ద అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంఇఒ కె. తాతారావు అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ కపిలేశ్వరపురం మండలం లోని అంగర, కపిలేశ్వరపురం పరీక్ష కేంద్రాల్లో 542 మంది విద్యార్థులు టెన్త్ పరీక్షలు రాస్తున్నట్లు ఎంఇఒ తెలిపారు. ఈ సందర్భంగా అంగర పరీక్ష కేంద్రంలో 356 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తారని, కపిలేశ్వరపురం పరీక్ష కేంద్రంలో 186 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. వాక తిప్ప జిల్లా పరిషత్ హైస్కూల్‌కు చెందిన 18మంది విద్యార్థులు గంగవరం మండలం పామరు హై స్కూల్ లో పరీక్షలు రాస్తారన్నారు. ఉదయం 9.30 నుండి మధ్యాహ్నం 12.45 వరకు విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తారన్నారు. కోవిడ్ నిబంధనల ప్రకారం ప్రతి విద్యార్థి మాస్కులు ధరించి గంట ముందుగా పరీక్షా కేంద్రాలకు ప్రతి విద్యార్థి హాజరు కావాల్సి ఉందన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉండటంతో పాటు విద్యార్థులు పరీక్షలు రాసేందుకు విద్యాశాఖ అధికారులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంఇఒ తాతారావు తెలిపారు. **కాట్రేనికోన** సోమవారం నుంచి జరగనున్న పదవ తరగతి పరీక్షలకు మండలంలో మూడు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని ఎంఇఒ బొజ్జ రమణ శ్రీ ఆదివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. పది పరీక్షలు నిర్వహించే ఈ మూడు కేంద్రాలలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. విద్యార్థులు ఎవరూ కూడా సెల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ వాచీలు, పరీక్ష కేంద్రాలకు తీసుకురాకూడదన్నారు పరీక్షా కేంద్రాలలో సిఎస్, డివోస్, ఇన్విజిలేటర్స్, ఆరోగ్య సిబ్బంది వద్ద కూడా సెల్ ఫోన్ ఉండకూడదని వాటిని పూర్తిగా నిషేధించడం జరిగిందన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని ప్రశాంతమైన వాతావరణంలో పరీక్షలు జరిగేందుకు ప్రతి ఒక్కరు సహకరించాలని ఆయన కోరారు.


మామిడికుదురు మండలం మొగలికుదురు పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న డిఇఒ కమలకుమారి

అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం



జిల్లాలో టెన్త్ పరీక్షలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు ఇప్పటికే పూర్తి చేశాం. విద్యార్థులకు ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా విద్యాశాఖ అధికారులు అన్ని చర్యలు చేపట్టారు. జిల్లాలో మొత్తం 111 కేంద్రాల్లో 10వ తరగతి పరీక్షలు నిర్వహిస్తున్నము. ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలతో కలిపి 20,967 మంది విద్యార్థులు పరీక్షరాయనున్నారు.

-ఎం.కమలకుమారి, డిఇఒ, డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా

ఇంటిని కూల్చిన వారిపై చర్యలకు డిమాండ్

- సంఘటన స్థలాన్ని సందర్శించిన మానవ హక్కుల వేదిక సభ్యులు

ప్రజాశక్తి-అమలాపురం

అక్రమంగా ఇంటిని కూల్చివేతకు కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని మానవ హక్కుల వేదిక బందం డిమాండ్ చేసింది. ఉప్పలగుప్తం మండలం చల్లపల్లిలో గొలకోటి నాగలక్ష్మికి చెందిన పెంకుటింటిని అక్రమంగా కూల్చేసిన విషయమై ఆదివారం ముగ్గురు సభ్యుల మానవ హక్కుల వేదిక బందం గ్రామానికి వెళ్లి నిజనిర్ధారణ చేపట్టింది. బాధితులతో మాట్లాడి వేదిక సభ్యులు విషయ సేకరణ చేశారు. వారి ఇంటికి ఎదురుగా అదే గ్రామానికి చెందిన దంగేటి రాంబాబు మూడంతస్తుల భవంతి నిర్మాణం చేపట్టారు. అప్పటి నుంచి తమ ఇంటిని కూల్చివేయాలని ఒత్తిడి మొదలైందనినాగలక్ష్మి దంపతులు వాపోయారు. ప్రస్తుతం కాకినాడలో తమ పిల్లల వద్ద ఉంటున్నామన్నారు. స్వగ్రామానికి వచ్చినప్పుడల్లా ఆ ఇంట్లోనే ఉంటామన్నారు. రాంబాబు నిర్మిస్తున్న కొత్త భవనం ఎదురుగా తమ పాత పెంకుటిల్లు చూడటానికి బాలేదని, అయితే ఆ స్థలం అమ్మేయాలని లేదా ఆ ఇంటిని కూల్చేయాలని బాధితులు అన్నారు. ఈ విషయమై రాంబాబు ఆయన అనుచరులతో పలుమార్లు ఫోను చేయించి బెదిరించే వాడని వారన్నారు. చివరికి గత నెల29న రాంబాబు గుమస్తా మాధవరపు వెంకటేష్ ఫోన్ చేసి తమ పెంకుటింటిని కుల్చేయాలని లేదంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని బెదిరించాడని బాధితులు తెలిపారు. తాము స్వగ్రామానికి వచ్చినప్పుడల్లా ఆ ఇంట్లో ఉంటున్నామని, తమకు కూల్చే ఉద్దేశం లేదని నాగ లక్ష్మి భర్త చెప్పారు. తర్వాత రోజునే ప్రొక్లెయిన్ తీసుకువచ్చి తమ ఇంటిని అక్రమంగా కూల్చివేశారని బాధితులు వాపోయారు. ఈ విషయమై ఉప్పలగుప్తం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదుచేశామన్నారు. బాధిత కుటుంబీకుల ఇంటిని అక్రమంగా కూల్చివేయించిన దంగేటి రాంబాబు అతనిఅనుచరులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మానవ హక్కుల వేదిక డిమాండ్ చేసింది. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎ.రవీ, జిల్లా అధ్యక్షులు మహమ్మద్ ఇక్బాల్ పాల్గొన్నారు.


కూల్చివేసిన ఇంటిని పరిశీలిస్తున్న సభ్యులు

అకాల వర్షాలతో రైతుల్లో ఆందోళన

ప్రజాశక్తి-రామచంద్రపురం

అల్పపీడన ద్రోణి ప్రభావంతో ఆదివారం మండలంలో భారీ వర్షం కురిసింది దీంతో వరిచేలు అక్కడక్కడ నేల కొరిగాయి. ప్రస్తుతం వరి చేలు పంట పండి కోతకు సిద్ధమవుతున్నాయి మరోవైపు ఆలస్యంగా నాటినవారినట్లు ఈనిక దశవరకు చేరుకున్నాయి. ప్రస్తుతం కురుస్తున్న అకాల వర్షాలతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇదేవిధంగా మరో రెండు మూడు రోజులు కురిస్తే పంటలకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని రైతులు తల్లడిల్లుతున్నారు. ఈ ఏడాది పంటలు బాగా పండుతుంది అని ఆశించిన రైతన్నలకు అకాల వర్షాలు ఆందోళన కలిగిస్తున్నాయి.


మేఘావృతమైన ఆకాశం

రేపు విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి-మండపేట

పట్టణంలోని మాండవ్యపురం సబ్ స్టేషన్ లో ఇండస్ట్రియల్ ఫీడర్‌లో విద్యుత్ మరమ్మతుల చేస్తున్న నేపథ్యంలో మంగళవారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఇ శాఖ రామచంద్రపురం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ దాట్ల శ్రీధర్ వర్మ తెలిపారు. స్థానిక విజయలక్ష్మి నగర్, వీరభద్రపురం తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని వినియోగాలు సహకరించాలని కోరారు.


ముస్లింములతో చర్చిస్తున్న పోలీసులు

అక్రమ నిర్మాణంపై ముస్లిముల ఆందోళన

ప్రజాశక్తి-మండపేట

స్థానిక కలువపువ్వు సెంటర్ లో జామియా మసీదు స్థలం ఆక్రమించి షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం చేపడుతున్నా రని ముస్లింలు ఆదివారం రాస్తారోకో చేశారు. సంఘటన స్థలాన్ని పోలీసులు పరిశీ లించారు. ముస్లిం పెద్దలు మాట్లాడుతూ జామియా మసీదుకు చెందిన స్థలాన్ని ఆక్రమించి నిర్మాణం చేపట్టారని దానిని నిలుపుదల చేయాలన్నారు. షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణదారులు మాట్లాడుతూ తమ స్థలంలోనే నిర్మిస్తున్నామని తాము ఎవరిదీ ఆక్రమించ లేదన్నారు. మున్సిపల్ అధికారులు ఆపమని నోటీసులు ఇచ్చారా అని అడగగా ఇచ్చారన్నారు. అనుమతులు రాకుండానే ఎందుకు నిర్మాణం చేపట్టారని పలువురు ప్రశ్నించగా అందుకే పైఅంతస్తు నిర్మాణం ఆపేశామంటు పొంతనలేని సమాధానం చెప్పారు. సంఘటనా స్థలాన్ని పరిశీలించిన కొత్తపేట డిఎస్‌పి వెంకటరమణ వివాదాన్ని కోర్టు ద్వారా తేల్చుకోవాలని, ఆందోళనలు చేపట్ట వద్దన్నారు.

కార్టూ'నిజం'



టిక్కెట్ కోసం జనంలోకి వెళ్లారు..
ఫలితం ఇదీ..!!

వికలాంగుల సంక్షేమానికి కృషి

ప్రజాశక్తి-అమలాపురం

వికలాంగుల సంక్షేమానికి కృషి చేస్తానని వైసిపి వికలాంగుల విభాగం జిల్లా అధ్యక్షులు కాశి వెంకటరమణ అన్నారు. ఆదివారం అమలాపురం కోనసీమ వికలాంగుల సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో కాశి వెంకటరమణ ను ఘనంగా సత్కరించారు. అమలాపురంలో పర్యటించిన వెంకటరమణ వికలాంగులకు వయోవద్ధులకు సేవా కార్యక్రమాలు చేస్తున్న కోనసీమ వికలాంగుల సంక్షేమ సేవా సంఘం గౌరవ అధ్యక్షులు ఒంటెద్దు వెంకయ్యానాయుడు, వికలాంగుల సంక్షేమ సేవా సంఘం అధ్యక్షులు నాగవరపు పరశురాముడులను ప్రత్యేకంగా అభినందించారు. వెంకటరమణ మాట్లాడుతూ తనకు పదవిని ఇచ్చిన సిఎం జగన్‌కు, ముమ్మిడివరం ఎంఎల్‌ఎ పొన్నాడ వెంకట సతీష్‌కు, వైసిపి రాష్ట్ర అధ్యక్షులు బందెల కిరణ్ రాజకు కృతజ్ఞతలు తెలిపారు. తాను ఎల్లప్పుడూ ప్రతి ఒక్కరికి నేను అందుబాటులో ఉంటానని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షులు ఒంటెద్దు వెంకయ్య నాయుడు, ఎపి వికలాంగుల మహా సంఘటన్ అధికార ప్రతినిధి నిమ్మకాయల సురేష్, అమలాపురం పట్టణ వికలాంగుల సమైక్య అధ్యక్షులు సుబ్రహ్మణ్యం, అయితాబత్తుల సురేష్, సత్య దుర్గ, బొంతు శ్రీనివాస్, సాధనాల విగ్నేశ్వర రావు, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న వైసిపి వికలాంగుల విభాగం జిల్లా అధ్యక్షులు వెంకటరమణ

అగ్ని ప్రమాద బాధితులకు సాయం

ప్రజాశక్తి-అమలాపురం రూరల్

బండారులంక పేరి వారి కాలనీలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వస్వం కోల్పోయిన చేనేత కుటుంబాలను ఆదివారం మంత్రి పినిపే విశ్వరూప్, ఎంఎల్‌సి కుడిపూడి సూర్యనారాయణ లు పరామర్శించారు. ఈ సందర్భంగా వైసిపి గ్రామ కమిటీ సమకూర్చిన దుస్తులు, రూ.80వేల నగదును బాధితులకు మంత్రి చేతుల మీదుగా అందజేశారు. ప్రభుత్వం తరపున అన్ని విధాలుగా ఆదుకుంటామని మంత్రి తెలియజేశారు. మంత్రి వెంట జెడ్‌పిటిసి సభ్యుడు పందిరి శ్రీహరి, ఎంపిపి కుడిపూడి భాగ్యలక్ష్మి, ఎంపిటిసి సభ్యులు, సెంట్రల్ డెల్టా బోర్డ్ ఛైర్మన్ కుడుపూడి బాబు, జిల్లా చేనేత విభాగం అధ్యక్షులు కాలెపు శ్రీనివాసరావు, చెల్లిబోయిన శ్రీనివాసరావు, బొంతు గోవింద్ శెట్టి, దంగేటి బుల్లబ్బులు తదితరులు పాల్గొన్నారు. మాతా రమాబాయి అంబేద్కర్ మహిళా సంఘం వ్యవస్థాపక అధ్యక్షురాలు పుణ్యమంతుల రజని ఆధ్వర్యంలో సంఘ సభ్యులు బండారులంకలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో నిరాశ్రయులైన 5 కుటుంబాలకు ఆదివారం నిత్యావసర వస్తువులు, దుప్పట్లు, చీరలు పంపిణీ చేశారు. రజని మాట్లాడుతూ సేవా కార్యక్రమంలో సంఘ సభ్యులు తమ సొంత డబ్బులతో వీటిని సమకూర్చారని అన్నారు. కార్యక్రమంలో కామరాజు పేట, అనాతవరం సంఘ సభ్యులు తదితరుల సంఘ సభ్యులు పాల్గొన్నారు.


బాధితులకు దుస్తులు పంపిణీ చేస్తున్న మంత్రి విశ్వరూప్

అల్లర్ల కేసుల ఎత్తివేతకు నిరసనగా నేడు ధర్నా

ప్రజాశక్తి-అమలాపురం

అమలాపురం అల్లర్ల కేసుల ఎత్తివేతకు నిరసనగా నేడు సోమవారం సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు దళిత నాయకులు తెలిపారు. దళిత నాయకులు డి.బి.లోక్ అధ్యక్షతన దళిత ఐక్యవేదిక, విద్యార్థి, ప్రజా సంఘాలు ఆధ్వర్యంలో ఈదరపల్లి లో ఆదివారం అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు. ఒక దళిత మంత్రి పినిపే విశ్వరూప్, బిసి సామాజిక వర్గానికి చెందిన ఎంఎల్‌ఎ పొన్నాడ సతీష్ ఇల్లు తగలబెట్టిన వారు అమాయకులు అయితే.. మరి అసలు దోషుల ఎవరని ప్రశ్నించారు. ఓటు బ్యాంకు రాజకీయాలు సిఎం మానుకోవాలని దళిత నేతలు హెచ్చరించారు. కేసులు ఎత్తివేత నిర్ణయం ఉపసంహరణ చేసుకోవాలని, లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం చేపడతామని వైసిపి ప్రభుత్వన్ని దళిత నేతలు హెచ్చరించారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట నిర్వహించబోయే ధర్నాకు దళితుల తల్లులు రావాలని దళిత నాయకులు పిలుపునిచ్చారు.


సన్నవిల్లిలో సిఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న మహిళలు

మహిళలకు అండగా సిఎం జగన్

ప్రజాశక్తి-ఉప్పలగుప్తం

రాష్ట్రంలోని మహిళలకు అండగా సిఎం జగన్ నిలిచి మహిళలు ఆర్థిక స్వాలంబన దిశగా ఎదిగేందుకు కృషి చేస్తున్నారని అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ మహిళా కో-ఆర్డినేటర్, ఎంపిటిసి సభ్యురాలు వంగా గిరిజాకుమారి అన్నారు. సన్నవిల్లి పంచాయతీ కార్యాలయం వద్ద 3వ విడత ఆసరా పథకం లబ్ధిదారులతో ఆదివారం గిరిజా కుమారి సమావేశం నిర్వహించారు. అనంతరం సిఎం జగన్ చిత్రపటానికి గిరిజా కుమారి, ఆసరా లబ్ధిదారుల మహిళలు క్షీరాభిషేకం చేశారు.


కాలనీవాసులతో మాట్లాడుతున్న ఛైర్‌పర్సన్ రాణి

సమస్యల పరిష్కారానికి చర్యలు

ప్రజాశక్తి-మండపేట

పట్టణంలోని 20వ వార్డు వైయస్ఆర్ కాలనీలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి ఆదివారం పర్యటించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కాలనీ వాసులు తీసుకొచ్చిన పలు సమస్యలు త్వరితన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. వార్డు ప్రజలకు సచివాలయ కన్వీనర్లను, గృహ సారథులను పరిచయం చేశారు. ఆమె వెంట కౌన్సిలర్లు శెట్టి కల్యాణి, అమలదాసు లక్ష్మీ, యరమాటి వెంకన్నబాబు వాలంటీర్లు ఉన్నారు.

నాలుగేళ్లయినా కానరాని జాబ్ క్యాలెండర్

ప్రజాశక్తి-రామచంద్రపురం

వైసిపి ప్రభుత్వం వచ్చి నాలుగేళ్లయినా ఇంతవరకు జాబ్ క్యాలెండర్ విడుదల చేయలేదని టిడిపి ఇంఛార్జి, మాజీ శాసన మండలి డిప్యూటీ ఛైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యం విమర్శించారు. కె.గంగవరం మండలంలోని దంగేరు గ్రామంలో ఆదివారం టిడిపి విస్తతస్థాయి కార్యకర్తల సమావేశం జరిగింది. సమావేశంలో పాల్గొన్న రెడ్డి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ నిరుద్యోగులకు ఉద్యోగాలు కరువయ్యాయన్నారు. కనీసం నిరుద్యోగులకు నిరుద్యోగ భతి కూడా ఇవ్వలేదని దీంతో నిరుద్యోగులంతా వైసిపి ప్రభుత్వంలో తీవ్రంగా నష్టపోయారు అన్నారు ప్రజలకు ఉపయోగపడే సంక్రాంతి కానుక రంజాన్ తోఫా, చంద్రన్న కానుక, పెళ్లికానుక వంటి పథకాలన్నిటినీ రద్దు చేశారనిగుర్తు చేశారు. వచ్చే ఎన్నికల్లో టిడిపి విజయానికి కార్యకర్తలు కలిసి పనిచేయాలన్నారు. జిల్లా టిడిపి పరిశీలకు కాకినాడ రామారావు, నాయకులు గరికిపాటి సూర్యనారాయణ మాజీ జెడ్‌పిటిసి సభ్యుడు చింతపల్లి వీరభద్రరావు, మండల పార్టీ నాయకులు మరి వాడ చిన్నికష్ణ, రావిపాటి గణేష్ చౌదరి పార్టీ మండల నాయకులు మేడిశెట్టి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బాలకృష్ణ జయంతి

ప్రజాశక్తి - అమలాపురం రూరల్

సాకుర్రు గ్రామానికి చెందిన దళితరత్న, సేవాప్రపూర్ణ పొలమూరి బాలకృష్ణ 81వ జయంతిని సందర్భంగా నాయకులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పలువురు నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పొలమూరి ధర్మపాల్ అధ్యక్షతన ఈకార్యక్రమం జరిగింది. పలువురు నాయకులు మాట్లాడుతూ బాలకృష్ణ జీవితం అందరికీ ఆదర్శమన్నారు. అంబేద్కర్ స్థాపించినా రిపబ్లికన్ పార్టీ లోనే తన జీవితం అంతా కొనసాగించారన్నారు. సాకుర్రు గ్రామానికి ఆయన చేసిన సేవలకు గాను గ్రామప్రజలు ఆయనకు 31సంత్సరాలు ఏకగ్రీవంగా జనరల్ పంచాయతీ సర్పంచ్‌గా పట్టం కట్టారు. బాలకృష్ణ సాకుర్రు గ్రామం లో ఇద్దరు గవర్నర్లు చే అవార్డు అందుకున్నారు. కార్యక్రమంలో మాజీ ఎంఎల్‌ఎ అయితాబత్తుల ఆనందరావు, మాజీ ఒఎన్‌జిసి ఏసెట్ మేనేజర్ డిఎంఆర్ శేఖర్, మాజీ ఎంపిపి నీనా పద్మజ ధర్మపాల్, సర్పంచ్ లు గుత్తుల చిరంజీవి, పెద్దిరెడ్డి రాము తదితరులు పాల్గొన్నారు.


నివాళులర్పిస్తున్న పలువురు నాయకులు


సదస్సులో వైద్యులను సత్కరిస్తున్న పిఎంపిలు

కిడ్నీ వ్యాధులపై అవగాహన సదస్సు

ప్రజాశక్తి-మండపేట

స్థానిక టౌన్ హాల్ నందు పిఎంపి అసోసియేషన్ ఆధ్వర్యంలో వైద్య విజ్ఞాన అవగాహన సదస్సు ఆదివారం జరిగింది. రాజమహేంద్రవరానికి చెందిన కిడ్నీ వ్యాధి నిపుణులు డాక్టర్ సూరపురెడ్డి బిపిన్ కుమార్ మాట్లాడుతూ వేసవిలో మూత్రపిండాలకు వచ్చే రుగ్మతల గురించి తెలిపారు. ఆహారనియమాలను పాటించక పోవడంతో, విచ్చలవిడిగా మాత్రలు వాడడం, అధిక రక్తపోటు తదితర కారణాల నేపథ్యంలో ఎక్కువమంది కిడ్నీ వ్యాధులకు గురవుతున్నారు. అనంతరం జీర్ణాశయ, కాలేయ వ్యాధి నిపుణులు డాక్టర్ జి స్వాప్నిక మాట్లాడుతూ గ్యాస్ట్రిక్, పెప్టిక్, డ్యూడనల్ అల్సర్ల వ్యాధుల గురించి కామెర్లు, వైరల్ హెపటైటీస్ లను ఎలా గుర్తించాలో తెలిపారు. రాష్ట్రకార్యవర్గసభ్యులు కోన సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి మారిశెట్టి సత్యనారాయణ,సూరంపూడి వీరభద్రరావు, బివి.రమణ తదితరులు పాల్గొని వైద్యులను ఘనంగా సత్కరించారు.

గృహ సారథులు వారధిలా పనిచేయాలి

ప్రజాశక్తి-మండపేట

గృహ సారథులు, వాలంటీర్లు ప్రభుత్వానికి వారధిలా పనిచేయాలని మున్సిపల్ ఛైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి, కోఆప్షన్ సభ్యులు రెడ్డి రాజాబాబులు అన్నారు. ఆదివారం స్థానిక ధర్మగుండంలో ఉన్న ఫంక్షన్ హాల్లో 14,16, 21, 22 వార్డుల కౌన్సిలర్ల ఆధ్వర్యంలో వాలంటీర్లు, గృహసారథులతో సమావేశం నిర్వహించారు వారు మాట్లాడుతూ సిఎం జగన్ నవరత్నాలతో సంక్షేమ ఫలాలను పేదలకు నేరుగా అందిస్తున్నారని అర్హత ఉండి ఫలాలను అందని వాళ్లను గుర్తించే బాధ్యతను తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ మెండు బాపిరాజు తదితరులు పాల్గొన్నారు.


నియామక పత్రాలు అందుకుంటున్న వాలంటీర్లు

వాలంటీర్లకు నియామక పత్రాలు

ప్రజాశక్తి - ఆలమూరు

బడుగువానిలంకలో ఇద్దరు నూతన వాలంటీర్లకు ఉప సర్పంచ్ పినమాల జ్యోతి, కార్యదర్శి యు.సుప్రియ, వైసిపి నేతలు కటారి గంగరాజు, పినమాల తాతాజీ, కటారి కుమార్ నియామక పత్రాలు అందజేశారు. ఇందుకు నూతన వాలంటీర్లుగా పినమాల సౌజన్య, మారిశెట్టి విజయ దుర్గలు ఎంపికయ్యారు. వారు మాట్లాడుతూ వాలంటీర్లుగా విధుల్లో అధికారుల ఆదేశాలు మేరకు క్రమశిక్షణతో నడుచుకొని ప్రభుత్వానికి మంచి పేరు తీసుకుని రావాలన్నారు. సంక్షేమ పథకాలను వివరిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు.

వైభవంగా వెంకన్న కల్యాణం

ప్రజాశక్తి-రాజోలు

రాజోలు సుందరమ్మ చెర్వు గట్టు సమీపంలో ఉన్న వెంకటేశ్వర స్వామి వారి కల్యాణం ఆదివారం లయ ఛైర్మన్ మొల్లేటి నాగరాజు, బిందు మాధవి దంపతులచే వైభవంగా జరిగింది. అధిక సంఖ్యలో యాత్రికులు తరలివచ్చి కల్యాణాన్ని వీక్షించారు. ఆలయకార్య నిర్వహణాదికారి బి.నాగ విష్ణు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

నేరాలు ఘోరాలు

కోడి పందేలపై పోలీసుల దాడి

ప్రజాశక్తి - గోపాలపురం

మండలంలోని సాగిపాడు గ్రామ శివారులో రహస్యంగా కోడి పందేలు నిర్వహిస్తుండగా ఎస్ఐ కె.రామకృష్ణ తన సిబ్బందితో దాడి నిర్వహించినట్లు తెలిపారు. ఈ దాడుల్లో ఒక కోడి, ఒక కోడికత్తి, రూ.9,230 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారిపై కోసు నమోదు చేసినట్టు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు.

వేతనాల చెల్లింపులో తీవ్ర జాప్యం

ప్రజాశక్తి -సామర్లకోట

కాకినాడ జిల్లా వ్యాప్తంగా సబ్ స్టేషన్లలో ఔట్సోర్సింగ్‌లో పనిచేస్తున్న షిఫ్ట్ ఆపరేటర్లు వేతనాలను ఇస్రో ఖాతాల ద్వారా చెల్లింపులో కాంట్రాక్టర్లు తీవ్ర జాప్యం చేస్తున్నారు. ప్రతి నెలా కార్మికులకు రావలసిన వేతనాలు కాంట్రాక్టర్ల నుండి సరైన సమయాల్లో వెయ్యటం లేదని ఉద్దేశంతో ఎపి ఇపిడిసిఎల్ ఉన్నత అధికారులు షిఫ్ట్ ఆపరేటర్లకు ఇస్రో ఖాతాల ద్వారా వేతనాలు చెల్లించాలని ఆదేశాలు జారీ చేశారు. కాంట్రాక్టర్లు ఇందులో తీవ్ర జాప్యం చేయడంతో నేటికీ ఇస్రో ఖాతాలను కూడా ప్రారంభించలేదు. ఇస్రో ఖాతాల ద్వారా ఏరోజైతే విద్యుత్ శాఖ అధికారులు కాంట్రాక్టర్ అకౌంట్లో జమ చేశారో అదే రోజు కాంట్రాక్టర్లు ఇఎస్ఐ, పిఎఫ్‌లను కార్మికుని వేతనం ఒకేసారి జమవుతుందని దీనివల్ల కార్మికుల వేతనాలు వేయడంలో జాప్యం జరగకుండా ఉంటుందన్నారు. ప్రతి నెలా ఒకటో తారీఖున వేతనాలు వస్తాయని సబ్ స్టేషన్ లో పనిచేసే షిఫ్ట్ ఆపరేటర్లు అనుకున్నారు. కాంట్రాక్టర్లు చేసిన నిర్లక్ష్యం వల్ల నేటికీ కూడా ఇస్రో ఖాతాలే ప్రారంభించలేదు. దీనితో కాకినాడ జిల్లా పరిధిలోని సుమారు 1500 మంది షిఫ్ట్ ఆపరేటర్లు నష్టపోతున్నారు. అధికారులు స్పందించి కాంట్రాక్టర్లతో సబ్ స్టేషన్లో పనిచేసే షిఫ్ట్ ఆపరేటర్లందరికి ఇస్రో ఖాతాలను ప్రారంభించి ప్రతినెల ఒకటో తేదీన జీతాలు పడే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


రోహిత్ పుట్టిన రోజు వేడుకల్లో అభిమానులు

ఘనంగా ఐవి.రోహిత్ పుట్టినరోజు

ప్రజాశక్తి-అన్నవరం

అన్నవరం దేవస్థానం చైర్మన్ ఐవి.రోహిత్ పుట్టినరోజు వేడుకలను అన్నవరంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆదివారం స్థానిక శాంతి వర్ధన వికలాంగుల ఆశ్రమ పాఠశాలలో చిన్నారుల సమక్షంలో చైర్మన్ ఐవి.రోహిత్ అభిమానులు కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. విద్యార్థులకు స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు. అనంతరం అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ అభిమానులు అత్తి సత్తిబాబు, వీర్ల సూరిబాబు, దారా వెంకటరమణ, కెఎల్‌టిసి.బాబూరావు, పిన.సతీష్, కె.గణేష్ పాల్గొన్నారు.


నిరసన తెలుపుతున్న సత్తిబాబు తదితరులు

కల్తీ మాంసం విక్రాయాలపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి -గోకవరం

కల్తీ మాంసం విక్రయాలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని గోకవరం సొసైటీ అధ్యక్షులు గాజింగం సత్తిబాబు అన్నారు. ఆదివారం సత్తిబాబు ఆధ్వర్యంలో రోడ్డుపై బైటాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సత్తిబాబు మాట్లాడుతూ కల్తీ మాంసం విక్రయాలపై సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేశామన్నారు. అయినా ఎటువంటి స్పందన లేదన్నారు. దీంతో వినియోగదారులతో కలిసి ఆదివారం నిరసన ర్యాలీ నిర్వహించామన్నారు. కల్తీ మాంసం కారణంగా ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారన్నారు. వ్యాధులు సోకిన, చచ్చిన మేకలు, ఆవు మాంసాన్ని వ్యాపారులు విక్రయిస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

గృహ సారథుల మండల కన్వీనర్‌గా వెంకటసతీష్

ప్రజాశక్తి- దేవరపల్లి

వైసిపి గృహసారథుల మండల కన్వీనర్‌గా త్యాజంపూడి ఉపసర్పంచ్, వైసిపి సోషల్ మీడియా నియోజకవర్గ కన్వీనర్ కుసులూరి వెంకటసతీష్ నియమితులయ్యారు. శనివారం దేవరపల్లిలోని తన క్యాంపు కార్యాలయంలో గోపాలపురం ఎంఎల్ఎ తలారి వెంకట్రావు ఈ విషయాన్ని ప్రకటించారు. వెంటకసతీష్ మాట్లాడుతూ పార్టీ తనపై నమ్మకంతో ఉంచిన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తిస్తానని తెలిపారు.

'ఉపాధి' పనులు ప్రారంభం

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

దమ్మెన్నులో ఆదివారం ఉపాధి హామీ చట్టంలో భాగంగా పనులను ప్రారంభించామని ఎంపిడిఒ ఎ.శ్రీనివాస్ తెలిపారు. పంచాయతీ ఊర చెరువు పూడికతీత పనులను సర్పంచ్ గురజర్ల వీర వెంకట సత్యనారాయణ కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. సుమారు రూ 9 లక్షలు అంచనాతో 3,500 పనిదినాలతో ఈ పనులు నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ తెలిపారు. కార్యక్రమంలో సాంకేతిక సహాయ కుడు గొల్లపల్లి కాంతారావు, సిబ్బంది పాల్గొన్నారు.

టిడిపిలో పలువురి చేరిక

ప్రజాశక్తి-కొత్తపేట

ఆలమూరు మండలం మూలస్థానం గ్రామం నుంచి పలువురు జనసేన నుంచి టిడిపిలో చేరారు. ఆదివారం వాడపాలెం టిడిపి కార్యాలయం వద్ద నియోజకవర్గ పార్టీ ఇంఛార్జ్ బండారు సత్యానందరావు సమక్షంలో టిడిపిలో చేరిన వారికి సత్యానందరావు పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు

పది పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

కాకినాడ డిఇఒ అన్నపూర్ణ





ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

సోమవారం నుంచి 18వ తేదీ వరకు జరగనున్న పదో తరగతి పరీక్షలకు పగడ్బందీగా ఏర్పాట్లు చేసినట్లు కెఎన్‌విఎస్ అన్నపూర్ణ చెప్పారు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులూ తలెత్తకుండా వివిధ శాఖల సమన్వయంతో ఇప్పటికే అన్ని సదుపాయాలు పూర్తి చేసినట్లు తెలిపారు. ప్రతి కేంద్రంలోనూ గాలి, వెలుతురు వచ్చేలా ఏర్పాట్లు చేశారు. ముఖ్యంగా మంచినీటి సదుపాయం, మరుగుదొడ్లు అందుబాటులో ఉండాలని సూచించామన్నారు.

ఎంతమంది పరీక్షలు రాయనున్నారు.?

ఉదయం 9:30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 నిమిషాల వరకు ప్రతిరోజు జరుగుతున్న పరీక్షలను 136 కేంద్రాలకు 29,988 మంది హాజరు కానున్నారు. వీరిలో రెగ్యులర్‌గా బాలురు 13,647, బాలికలు 13,820 మంది ఉన్నారు. తెలుగు మీడియంలో 8,785 మంది, ఇంగ్లీషు మీడియంలో 18,682 మంది ఉన్నారు. ప్రైవేటుగా 1,499 మంది బాలురు, 971 బాలికలు ఉన్నారు.

సమస్యాత్మక కేంద్రాల్లో ఎటువంటి ఏర్పాటు చేస్తున్నారు.?

జిల్లాలో దానవాయిపేట, పెరుమాళ్లపురం, కోటనందూరు, రౌతులపూడి జిల్లా పరిషత్ హైస్కూల్స్ అతి సమస్యాత్మక కేంద్రాలుగా ఉన్నాయి. వీటిలో సిసి కెమెరాలు ఏర్పాటు చేసి నిరంతరం ప్రైవేటు పరీక్షా సెంటర్లలో సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించాం. పరీక్షల్లో విధులు నిర్వ హించే పరిశీలకులకు, డిపార్ట్మెంట్ అధికారులకు ఇప్పటికే శిక్షణ ఇచ్చాం. ప్రతి కేంద్రం వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుంది.

ఈసారి పరీక్ష విధానంలో ఎటువంటి మార్పులు వచ్చాయి.?

గత పరీక్షల్లా ఈసారి 11 ప్రశ్నపత్రాలు ఉండవు. విద్యాశాఖ వాటిని కుదించి 6 ప్రశ్నపత్రాలుగా మార్పు చేసింది. సైన్సుకు సంబంధించి జీవ, రసాయన, భౌతికశాస్త్రాలను ఒకే పరీక్షగా నిర్వహిస్తారు. ఒక్కో విద్యార్థికి ముందుగా 24 పేజీలుండే జవాబు పత్రం ఇస్తారు. విద్యార్థులు అదనంగా కావాలనుకుంటే మరొక 12 పేజీలు గల జవాబు పత్రం ఇస్తారు.

మాల్ ప్రాక్టీస్ నివారణకు ఏమి చర్యలు తీసుకుంటున్నారు.?

జవాబు పత్రాలపై క్రమసంఖ్య ఉంటుంది. దీంతో ఒక విద్యార్థి పత్రాలు మరొక విద్యార్థి దగ్గర ఉంటే సులభంగా గుర్తించడానికి వీలుంటుంది. ముఖ్యంగా ప్రతి ప్రశ్నపత్రంపై ఒక యూనిక్ సంఖ్య ఉంటుంది. ఒకవేళ ఏదైనా ప్రశ్న పత్రం బయటకు వచ్చినా అది ఎక్కడ నుంచి వచ్చిందో సులువుగా గుర్తిస్తాము.

ఎటువంటి జాగ్రత్తలు వహించేలా చర్యలు చేపట్టారు.?

పరీక్షా కేంద్రాల వద్ద 100 మీటర్ల లోపు జిరాక్సు సెంటర్లు, సెల్ ఫోన్ దుకాణాలు తెరచి ఉంచకుండా చర్యలు తీసుకున్నాం. పరీక్ష కేంద్రాలన్నింటిని 'నో సెల్ఫోన్ ' జోన్లుగా ప్రకటించారు. కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ వస్తువులను అనుమతించరు. విద్యార్థులు పరీక్ష ప్రారంభానికి కనీసం అరగంట ముందుగా కేంద్రానికి చేరుకోవాలి. కేంద్రాలకు సకాలంలో చేరుకునేందుకు వీలుగా బస్సులు నడిపేందుకు ఆర్టీసీ అధికారులు చర్యలు చేపట్టారు.

ప్రణాళికతో చదివితే 'పది' జిపిఎ

సబ్జెక్టుల వారీగా అవగాహన అవసరం

విద్యార్థులకు విషయ నిపుణుల సూచనలు, సలహాలు

ప్రజాశక్తి-రాజోలు

ప్రణాళికతో చదివితే టెన్త్ పరీక్షల్లో మంచి మారులు సాధించవచ్చు. ఈ నెల 3వ తేదీ నుంచి పదో తరగతి వార్షిక పరీక్షలు మొదలుకానున్న నేపథ్యంలో ఏయే విషయాలపై దష్టి సారించాలనే విషయాలపై సబ్జెక్టుల వారీగా నిపుణులు తమ సలహాలు అందజేశారు. పది జిపిఎ ఎలా సాధించవచ్చనే అంశంపై పలువురు ఉపాధ్యాయులు సూచనలిస్తున్నారు.

వ్యాసరూప ప్రశ్నలపై పట్టు ఉండాలి



తెలుగులో 80 మారులకు 20 మార్కులు అవగాహన, ప్రతిస్పందన నుంచి పొందొచ్చు. దానశీలం, భిక్షపాతాల నుంచి చుక్క గుర్తు పద్యాల్లో ఒకటి అడిగే అవకాశముంది. ఆధునిక పద్య పాఠాలు, వీర తెలంగాణ, శతక పద్యాల నుంచి ఒకటి వస్తుంది. అపరిచిత గద్యం ప్రతి ప్రశ్నకు రెండు మార్పులు ఉన్నందున అర్థం చేసుకొని 1 లేదా 2 మాటల్లో జవాబు రాయాలి. స్వీయరచన, సజనాత్మకత, వ్యక్తీకరణ చిన్న ప్రశ్నల్లో ఒక కవి పరిచయం అడుగుతారు. ఇదే విభాగంలో ఏదైనా ఒక శతక సారాంశం లేదా భావం ప్రశ్న అడుగుతారు. వ్యాసరూప ప్రశ్నలకు రామాయణంపై పట్టు ఉంటే మంచి మారులు సాధించొచ్చు.

-దేవరకొండ శ్రీనివాస్ వెంకటరమణారావు, తెలుగు ఉపాధ్యాయులు

ప్రణాళికే ప్రధానం



ఫిజిక్స్, బయోలజీ కలిపి ఒకే రోజు పరీక్ష రాయాల్సి ఉన్నందున ముఖ్యమైన విషయాలు గుర్తు పెట్టుకుంటే మంచి మారులు సాధించవచ్చు. ప్రయోగాలకు తొమ్మిది మారులు కేటాయించారు. 2 మార్కుల ప్రశ్నలుగా.. ప్రయో గ సామగ్రి పరిశీలన, ఫలితాల్లో ఒకటి అడు గుతారు. ఆరు మారుల ప్రశ్నల్లో ఒక ప్రయోగ విధానం తప్పనిసరిగా వస్తుంది. విషయ అవగాహనలో 18 మారులకు వచ్చే ప్రశ్నల్లో బ్లీచిం గ్ పౌడర్, వాషింగ్ సోడా ఉపయోగాలు, కుంభాకార, పుటాకార దర్ప ణాల బేధాలు, ఆవర్తన పట్టిక లక్షణాలు వంటివి చదవాలి.

-పితాని వెంకటేశ్వరరావు, భౌతిక శాస్త్ర ఉపాధ్యాయులు

లెక్కలంటే భయమెందుకు..



మంచి మారుల కోసం 14 చాప్టర్లపై పట్టు సాధించాలి. ప్రభుత్వం ఇచ్చిన అభ్యాసదీపిక లోని నమూనా ప్రశ్నలు సాధన చేస్తే మంచి మారులు పొందవచ్చు. గ్రాఫ్ సమస్యలు సాధించేటప్పుడు తప్పక సేల్, సాధన రాయాలి. నిర్మాణ పటం గీసేటప్పుడు నిర్మాణ క్రమం, నిర్ధారణ కూడా రాయా లి. వాస్తవ సంఖ్యల్లో లాగరిథమ్స్, సమితులలో వెన్ చిత్రాలు, సెట్ బిల్డర్ సామ్, రోస్టర్ ఫామ్ రాయడం, బహుపదుల్లో పరావలయం గీయడం, సంభావ్యత, సంఖ్యాక శాస్త్రంలో మీన్, మీడియన్, మోడ్ లెక్కలతోపాటు ఓజివ్ గ్రాఫ్‌లే కాక, సరూప త్రిభుజ నిర్మాణాలు, వత్తానికి స్పర్శరేఖలు గీయడం త్రికోణమితి అనువర్తనాలు నుంచి బొమ్మ గీయడం ప్రాక్టీస్ చేయాలి.

-ఎవి.రాఘవేంద్రరావు,గణితఉపాధ్యాయులు,శివకోడు

హిందీపై పట్టు సాధించాలి



హిందీపై పట్టు సాధించి, భాషా జ్ఞానాన్ని పెంచుకుంటే అపజయం ఉండదు. పఠిత గద్యాంశం పుస్తకంలో నాలుగు ఉప వాచక పాఠాల నుంచే ప్రశ్నలు అడుగు తారు. పఠిత పద్య 1,2,4(బరసతే బాదల్, మా ముఝే అనేదే, కణ్‌కణ్‌కా అధికారి) పాఠశాల నుంచి ఒక పద్యం ఇచ్చి ఐదు ప్రశ్నలు వేస్తారు. పద్యాల భావం నేర్చుకుంటే మంచి మార్కులు వస్తాయి. రెండో విభాగం.. నాలుగు మార్కుల ప్రశ్నల్లో ఒకటిగా ఉండే కవి పరిచయం కోసం చరిత్రలు నేర్చుకోవాలి. 8 మార్కుల ప్రశ్నలు పద్యభాగం, గద్యభాగం నుంచి రెండేసి అడుగుతారు. అపఠిత గద్యం ప్రశ్నలకూ సులభంగా మార్కులు పొందవచ్చు.

-బత్తుల వి.ఆనంద్‌కుమార్,అసిస్టెంట్ హిందీ, చింతపల్లి

బొమ్మలపై పట్టు ఉండాలి



సామాన్య శాస్త్రం రెండు పేపర్లుగా ఉంటుంది. పార్ట్-బీకి గంటన్నర సమయం ఉం డగా.. 40 మారుల ప్రశ్నాపత్రానికి సమాధానాలు రాయాలి. హైడ్రిల్లా ప్రయోగం, సీ 02 అవసరం. కిరణజన్య సంయోగ క్రియకు కాంతి అవసరం, శ్వాసక్రియలో సీ 02 ఉష్ణం విడుదలవుతోందని చూపే ప్రయోగాలు నేర్చుకుంటే ఎనిమిది మార్కులు సొంత మవుతాయి. ఇక మానవుని జీర్ణవ్యవస్థ, ఏక వలయ, ద్వివలయ రక్త ప్రసరణ మూత్రపిండాలు అంతర్నిర్మాణం బొమ్మలను నేర్చుకుంటే ఆరు మార్కులు సాధించొచ్చు.పర్యావరణ సంరక్షణపై పట్టు పెంచుకుంటే ఈ విభాగంలో 18 మార్కులు సాధించొచ్చు.

-సిహెచ్.హరిచంద్రప్రసాద్, సైన్స్ ఉపాధ్యాయులు, తాటిపాక

ఆంగ్లం అంటే భయాన్ని వీడాలి



ఆంగ్లమనే భయం వీడితే మంచి మారులు సాధించవచ్చు. ప్రశ్నాపత్రంలో 1 నుంచి 4, 5 నుంచి 8 ప్రశ్నలు రీడింగ్ విభాగంలో పాఠ్యపుస్తకం నుంచి ఇచ్చే ప్యాసేజ్ చకగా చదివాక ప్రతి ప్రశ్నకు మూడు వ్యాక్యాల సమాధానం రాయాలి. why do you think ,what do you think, How would you respond, what would you you do వంటి ప్రశ్నలు అడిగితే if i were, .i would వంటి వ్యాక్యంతో సమాధానాలు మొదలుపెడితే మంచిది. పాఠ్యపుస్తకం క్షుణ్ణంగా చదివితే మంచి సమాధానాలు రాయచ్చు.

-నల్లి విశ్వనాథ్, ఇంగ్లిష్ ఉపాధ్యాయులు, అంతర్వేది పాలెం

అన్ని ప్రశ్నలకు ఒకేతీరు సమాధానాలు వద్దు



అన్ని ప్రశ్నలకు ఒకేతీరుగా కాకుండా అడిగిన విధానాన్ని బట్టి సమాధానం రాయాలి. వ్యాసరూప సమాధాన ప్రశ్నలకు కారణాలు, పోలికలు, బేధాలు, ఫలితాలు, ప్రభావితం చేసే అంశాలను వర్గీకరించడం, ఉదాహరణలతో వివరించాలి. పట్టికలు, గ్రాఫులు కచ్చితంగా అడిగే అవకాశం ఉంది. ఇచ్చిన డేటా ఆధారంగా విశ్లేషణ చేయడంతోపాటు కారణాలు, ఉదాహరణలు, ఫలితాలే కాకుండా సూచనలు, పరిష్కార మార్గాల వంటి వాటితో మంచి మార్కులు ఖాయం.

-కట్టా జగన్‌మోహన్, సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు, జిల్లా పరిషత్, రాజోలు

యానాం వార్తలు


ఆందోళన చేస్తున్న గ్రామస్తులు, సిఐటియు నాయకులు

కార్మికుని కుటుంబానికి అండగా సిఐటియు

ప్రజాశక్తి - యానాం

యానాం దరియాలతిప్పలోని శ్రీ గాయత్రీ రైస్ మిల్లులో విధులు నిర్వహిస్తూ మతి చెందిన కార్మికుడు జగన్నాథరావుకు న్యాయం చేయాలంటూ ఆదివారం ఆందోళన చేపట్టారు. సిఐటియు జిల్లా కార్యదర్శి జి.దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో ఆదివారం రైస్ మిల్ గేటు వద్ద దరియాలతిప్ప గ్రామస్తులు, కుటుంబ సభ్యులు ఆందోళన చేపట్టారు. రైస్ మిల్ యాజమాన్యం దిగివచ్చి సిఐటియు నాయకులు, గ్రామస్తులు,పోలీస్ సిబ్బందితో చర్చలు జరిపారు. అనంతరం మతి చెందిన జగన్నాథరావు కుటుంబానికి న్యాయం చేస్తామని రైస్ మిల్ యాజమాన్యం తెలిపింది. ఎస్ఐ శేరు నూకరాజు యాజమాన్యంతో ఒప్పంద పత్రాన్ని రాయించారు.


వార్షికోత్సవానికి హాజరైన ప్రముఖులు

ఘనంగా 'శ్రీ వేద' వార్షికోత్సవం

ప్రజాశక్తి - యానాం

యానాం నియోజకవర్గంలో స్థానిక గోపాల్ నగర్‌లో ఉన్న శ్రీ వేద పబ్లిక్ స్కూల్ మొదటి వార్షికోత్సవం చైర్మన్ గుత్తుల గోవింద జయరామారావు ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విద్యాశాఖ అధికారి పంపన లక్ష్మణ ప్రవీణ్, గూటం శివ గణేష్, దాట్ల దేవదానం రాజు, బొల్లోజు బాబా, దంగేటి త్రిమూర్తులు, మట్టపర్తి లోవరాజు తదితరులు పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. చిన్నారులచే వివిధ సాంస్కతిక కార్యక్రమాలు నిర్వహించి ముఖ్య అతిథుల చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్లు అర్జున్, నీతూ హరి, ప్రిన్సిపల్ ఎస్.అనుపమ, డివివి సత్యనారాయణ, నిమ్మకాయల శ్రీను, బంగారం, గుత్తుల నందు తదితరులు పాల్గొన్నారు.

సూర్య పోలి క్లినిక్ ఆధ్వర్యంలో నేత్ర వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - యానాం

యానాం పైడికొండల వారి వీధిలో ఉన్న సూర్య పోలి క్లినిక్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా కపిలేశ్వరం నేత్ర వైద్య విజ్ఞాన సదస్సు ఎల్‌వి ప్రసాద్ అధ్యక్షతన ఉచిత మెగా స్పెషాలిటీ మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేసి పేదవారికి ఉచితంగా కంటి పరీక్షలు చేసినట్లు తెలిపారు. మొత్తం 187 మంది కంటికి సంబందించిన రోగులు హాజరయ్యారని,47 మందికి ఉచితంగా కాంట్రాక్ట్ సర్జరీలు చేయనునట్లు సూర్య పోలి క్లినిక్ యాజమాన్యం తెలిపింది.

8,9 తేదీల్లో ఉచిత శిక్షణ

ప్రజాశక్తి - కాట్రేనికోన

'స్టెప్' జాతీయ సమితి ఆధ్వర్యం లో వ్యక్తిత్వ వికాస నిపుణులు, సైకాలజిస్ట్ డాక్టర్ ప్రత్యూష సుబ్బారావు నాయకత్వం లో విజయవాడలో ఏప్రిల్ 8, 9 తేదీలలో రెండు రోజులు ఉచిత వక్త శిక్షణ ఇస్తారని స్టెప్ రాష్ట్ర సమితి సభ్యులు విత్తనాల వెంకటేశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల్లో, యువకుల్లో ఉన్న విద్యార్థుల అంతర్గత శక్తి సామర్థ్యాలను వెలికితీసి, ఆత్మ విశ్వాసం నింపి మంచి సమాజం నిర్మించాలనే లక్ష్యంతో శిక్షణ ఏర్పాటు చేశారన్నారు. పలు అంశాలపై శిక్షణ ఇస్తారన్నారు. ఈ శిక్షణ తరగతులకు ఉచితంగా హాజరయ్యే అవకాశం ఉందని మంచి వక్తలుగా మారాలని కోరుకునేవారు ఆసక్తి వున్నవారు తమ పేర్లను 90306 44440 నంబర్‌కు ఫోన్ చేసి పేరు నమోదు చేసుకోవాలన్నారు.

ఆకట్టుకున్న సైన్స్, మేజిక్ షోలు

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

కనికట్టు ద్వారా మాయ చేస్తున్న వారి వలలో పడకుండా విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని జనవిజ్ఞాన వేదిక జిల్లా నాయకులు బివి సత్యనారాయణ పిలుపునిచ్చారు. ఆదివారం సాయంత్రం సామర్లకోట మండలం మాధవపట్నం గ్రామం జమునానగర్ కాలనీలో అంగర లక్ష్మీకాంతం ఎడ్యుకేషనల్ సొసైటీ నిర్వహిస్తున్న బాలమందిరంలో సైన్స్ షక్ష నిర్వహణ, మేజిక్‌షోలు కార్యక్రమాలు సైన్స్ షోలను బివి సత్యనారాయణ నిర్వహించారు. విద్యార్థులకు వాటిపై అవగాహన కల్పించారు. గ్రంథాలయంలో పుస్తక సమీక్షలు నిర్వహించి, పరీక్షలను విద్యార్థులు పండుగలా భావించి ఉత్సాహంగా పరీక్షలు రాసి విజయాలు సాధించాలని బాలమందిరం కన్వీనర్ కృష్ణశ్రీ పిలుపునిచ్చారు. భాషా నైపుణ్యాలు గతవారం భాషా నైపుణ్యాలు పరీక్షల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సత్యనారాయణ

99వ రోజు 'గడప గడపకూ మన ప్రభుత్వం'

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

పి.వేమవరం గ్రామంలో 199వ రోజు నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎపీ స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు పాల్గొన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకుని సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి బొబ్బరాడ సత్తిబాబు, వైసిపి మండల అధ్యక్షుడు తాటికొండ అచ్చిరాజు, వైసిపి నాయకుడు ఎలిశెట్టి నరేష్, మాజీ సర్పంచ్ ఎలిశెట్టి భీమన్న దొర, సొసైటీ అధ్యక్షులు ఊటా వాసు, అత్తిలి రాంబాబు పాల్గొన్నారు.

వడ్లమూరులో 'ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి'

పెద్దాపురం : మండలంలోని వడ్లమూరులో ఆదివారం ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప ఆధ్వర్యంలో ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామంలోని అన్ని వీధుల్లో పర్యటించారు. ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావటం ద్వారానే రాష్ట్రం అన్ని రంగాల్లోనూ అభివద్ధి చెందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రాజా సూరిబాబు రాజు, పార్టీ మండల అధ్యక్షులు కొత్తెం వెంకట శ్రీనివాసరావు(కోటి), ఎలిశెట్టి నాని, బొడ్డు వెంకన్న, మొయిళ్ల కష్ణమూర్తి, నూనె రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా మట్టల ఆదివారం

మట్టల ఆదివారం పర్వదినాన్ని ఘనంగా నిర్వహిరంచుకున్నారు.

ప్రజాశక్తి - యంత్రాంగం

పెద్దాపురం పట్టణం, మండల పరిధిలో మట్టల ఆదివారం వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక స్వర్ణ దేవాలయం, డాక్టర్ ఇమ్మాన్యుయేల్ రాజు చర్చిలతోపాటు అన్ని చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం మట్టలతో ప్రజలు ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు. **గండేపల్లి** మండలంలో ఈస్టర్ ముందు వారం జరుపుకునే మట్ల ఆదివారంలో భాగంగా ఆయా గ్రామాల్లో ఉన్న చర్చిల్లో పిల్లలతో సహ ఘనంగా నిర్వహించారు. గండేపల్లి చర్చిలోనూ పిల్లలతో సహ ఈత కొమ్మల్లో పువ్వులు పెట్టి ర్యాలీ నిర్వహించారు. **సామర్లకోట** మండల పరిధిలో అన్ని క్రైస్తవ దేవాలయాల ఆధ్వర్యంలో సంఘ కాపరులు, పెద్దలు, యువజనులు, చిన్నారులు ఈత మట్టలను పూలతో అలంకరించి పురవీధులలో ప్రదర్శనలు చేపట్టారు. సెంటినరీ బాప్టిస్ట్ చర్చి, సెంటినరీ అగస్థానా లూథరన్ చర్చి, ఆంధ్ర బాప్టిస్ట్ చర్చి, ట్రూ గాస్పెల్ చర్చి, షాలెం బాప్టిస్ట్ చర్చి, బేరాకా ప్రార్థన మందిరం, షారోన్ బాప్టిస్ట్ చర్చి ఆధ్వర్యాన ర్యాలీలను నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో కిరణ్ బాబు, బి.కిరణ్ కుమార్, డాక్టర్ ఈలి సత్య సువార్త రాజు, వంకా జాన్, డాక్టర్ ఎం.ఎ.జేమ్స్ పాల్గొన్నారు.

అభివృద్ధిపై ప్రజలే న్యాయ నిర్ణేతలు

ప్రజాశక్తి-మండపేట

మండపేటను అభివృద్ధి చేసింది ఎవరో అందరికి తెలుసని ప్రజలే న్యాయ నిర్ణేతలని ఎంఎల్ఎ వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. ఆదివారం స్థానిక కపిలేశ్వరపురం రోడ్డులోని ఆయన నివాసం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అప్పటి కౌన్సిల్ తీర్మానం, అన్ని సంఘాల ఆమోదంతో స్థానిక కలువ పువ్వు సెంటర్లో తన తండ్రి వేగుళ్ళ వీర్రాజు విగ్రహం ఏర్పాటు చేశారన్నారు. తను అప్పటికి రాజకీయాల్లో లేనన్నారు. నియోజకవర్గంలోని 2308 పేద గహనిర్మాణదారుల బకాయిలు ఎప్పుడు చెల్లిస్తారో చెప్పమంటే ఏదేదో మాట్లాడుతూ అసలు విషయం పక్కదారి పట్టిస్తున్నారన్నారు. ఈ సమావేశంలో పట్టణ అధ్యక్షులు ఉంగరాల రాంబాబు, వాదా ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి రూ.10 వేలు అందజేత

ప్రజాశక్తి-రామచంద్రపురం

కాపవరం గ్రామానికి చెందిన కొండాయపాలెపు వీరబాబు (30) ప్రమాదవశాత్తు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు మతునికి భార్య, 3నెలల పాప ఉన్నారు. కుటుంబానికి వైయస్ఆర్ బీమా రూ.5లక్షల ఇన్సూరెన్స్ మంజూరైంది. తక్షణ సాయంగా రూ.10 వేలు నామినీ తల్లి కొండాయపాలెపు లక్ష్మికి మంత్రి తనయుడు నరేన్ చేతులమీదుగా అందజేశారు. కార్యక్రమంలో గుబ్బల ఏసురాజు, పంచాయతీ కార్యదర్శి రాయుడు మోహన్, వెల్ఫేర్ అసిస్టెంట్ పాలిక శ్రీరామలక్ష్మి, కొండాయపాలెపు నాగేశ్వరరావు, సామాని రాంబాబు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.


చెక్కు అందజేస్తున్న దృశ్యం